115

# సీరియల్ చేసిన పెళ్ళి

'కంగ్రాట్యులేషన్స్ చిట్టిబాబూ! ఈ మధ్య నీ పెళ్ళయిందట కదా! మమ్మల్నెవర్నీ పిలవలేదేమోయ్?'

'అనుకోకుండా పీడకలలోలా జరిగిపోయిందండి - పిలవడానికి టైమే లేదండి'

'మీ మేనమామ కూతురు వరలక్ష్మేట కదా! అవునూ, మతున్నవాడెవడూ వరలక్ష్మిని చేసుకోడు అంటూ ఉండేవాడివి కదోయ్! ఇప్పుడెలా చేసుకున్నావు?'

'మతి పోయిండి'

'అదేవిటి?'

'ఆ రోజు సీరియల్ చదివాను కదండి'

'ఏ సీరియల్ ?'

'సస్పెన్స్ కింగ్ డీవీపి సీరియల్'

'డీవీపి సీరియల్ చదివితే మతి పోవడమేమిటి? మతి పోతే వరలక్ష్మితో పెళ్ళవడమేమిటి? అదెలా జరిగిందోయ్?'

'ఇలాగండి'

***

చిట్టిబాబుకి వరలక్ష్మిని చేసుకోవడం మొదటినుంచీ ఇష్టం లేదు. వరలక్ష్మికి మాత్రం చిట్టిబాబంటే ఇష్టమే. చిట్టిబాబు తల్లికి మేనకోడలిని కోడలుగా చేసుకోవాలని చాలా పట్టుదలగా ఉండేది.

'చక్కగా చిలకా - గోరింకల్లా ఉంటారు మీ ఇద్దరూ' అనేది తల్లి.

'అవును, కొండంత చిలక, కొంగ లాంటి గోరింక'

'దానికేంరా! కొంచెం లావుగా ఉంటుంది కాని లక్షణమైన రూపం. టెన్తు కూడా పాసయింది'

'అలా అని చెప్పాడా మీ అన్నయ్య? ఇప్పటికి రెండుసార్లు తన్నింది. తెలుసా?'

'తంతే తన్నిందిలే, అదేమన్నా ఉద్యోగం చెయ్యాలా, ఊళ్ళేలాలా? మొగుడికి ఉత్తరం రాసుకోగలిగితే సరిపోతుంది. '

'మొగుడికే ఏం కర్మ? ఏ వారపత్రిక తిరగేసినా, 'కె.వరలక్ష్మి-కొత్తపేట' అని మీ మేనకోడలి మీ ( మా) ఉత్తరాలే,' అన్నాడు చిట్టిబాబు హేళనగా.

టెన్తు రెండుసార్లు తన్ని ఇంట్లో కూర్చున్న వరలక్ష్మి, ఆంధ్రుల అభిమాన రచయితల అభిమాన పాఠకురాలు. సస్పెన్స్ సీరియల్స్‌కి మహారాణి పోషకురాలు. ఏ కథైనా, నవలైనా చదివిన వెంటనే -' ఈ కథ అద్భుతంగా ఉంది. అనూహ్యకరమైన మలుపులతో, సస్పెన్స్‌తో మమ్మల్ని ఉక్కిరి బిక్కిరి చేసింది. ఇలాంటి కథ రాసిన రచయి తకూ, ప్రచురించిన మీకూ, చదివిన మాకూ కృతజ్ఞతలు' అంటూ ఓ మీ ( మా) ఉత్తరం రాసి పడేస్తుంది. 'వస్తోంది, వచ్చేస్తోంది, మీ అభిమాన రచయిత సీరియల్ - తేదీ కోసం ఎదురు చూడండి ' అని ప్రకటన రాగానే 'ఎప్పుడెప్పుడా అని కళ్ళు కాకర కాయలు చేసి ఎదురు చూస్తున్నాం' అంటూ రోజూ ఓ ఉత్తరం రాస్తుంది. మీ అభిమాన రచయిత రాయబోయే సీరియల్‌కి ప్లాట్లు చెప్పండి, పేర్లు సూచించండి అంటే, వెంటనే ప్లాట్లూ, పేర్లూ, కట్టలు కట్టలు పార్సిలు చేసేస్తుంది. 'సబ్బులమ్ముకుంటున్నట్లు వాళ్ళ కథలూ, నవలలూ అమ్ముకుంటున్నారే! నీ వెధవ ప్లాట్లూ, పేర్లూ వాళ్ళకి అక్కర్లేదే, అదంతా పబ్లిసిటీ స్టంటే' అని తండ్రి నెత్తీ నోరూ కొట్టుకున్నా వినదు.

'నన్ను అమాయకుణ్ణి చేసి ఆ తెల్ల ఏనుగుని నాకు అంటగట్టేద్దామని చూస్తున్నాడు మావయ్య. నా జీతమంతా పోస్టలు స్టాంపులుగా మార్చి చప్పరించేస్తుంది. అవును, ఈ మధ్య మావయ్య రెండు గేదెలు అమ్మేశాడుట. నిజమేనా?'

'ఏమో నాకు తెలియదు. రేపు వాళ్ళింటికి వెడుతున్నాం కదా. నువ్వే అడుగు ' అంది తల్లి విసుగ్గా.

'ఎవరు వెడుతున్నారు?

'ఇంకెవరు? నువ్వూ, నేనూను. మావయ్య పెళ్ళి విషయం మాట్లాడ్డానికి రమ్మని రాశాడు.'

'నే ముందే చెబుతున్నానేవ్! మీరందరూ ఏడ్చి మొత్తుకున్నా, ఆ వరాహలక్ష్మిని చేసుకోను.'

'చక్కటి పేరు వరలక్ష్మి ఉండగా ఏవిటా కూతలు. ఎవరేనా విన్నా బాగోదు' అని తల్లి మందలించింది. చిట్టిబాబు రానని ఎంత మొత్తుకున్నా తల్లితో పాటు మేనమామ ఇంటికి వెళ్ళక తప్పలేదు.

'ఓహో- అల్లుడు గారు దిగారన్నమాట' అన్నాడు మేనమామ ఆహ్వానిస్తూ.

'అల్లుడు కాదు, మేనల్లుడు' అని సరిదిద్ది, 'అవునూ, నువ్వు రెండు గేదెలమ్మేశావుట కదా ఈమధ్య,' అడిగాడు చిట్టి బాబు, మేనమామని చూడగానే గేదెలు

గుర్తుకొచ్చి.

'చూడవే నీ కొడుకు! ఇంట్లో అడుగుపెట్టిన వాడు నా గురించి కాని, వరలక్ష్మి గురించి కాని ఒక్కమాట అడగడం లేదు. గేదెల గురించి అడుగుతున్నాడు' అన్నాడు మేనమామ చిట్టిబాబు తల్లితో.

ఆ రోజు మధ్యాహ్నం భోజనాలైన తర్వాత రెండు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకూ చిట్టి బాబుని పెళ్ళికి ఒప్పించే ప్రయత్నాలు జరిగాయి.

చిట్టి బాబు లొంగలేదు. నా కిష్టం లేదు అని ఒకసారీ, నేను ఇప్పుడప్పుడే పెళ్ళి చేసుకోనని ఒకసారీ మొండికేశాడు.

'ఇష్టం లేదట. బావకి కొంచెం స్క్రూలు టైటుచెయ్యాలి' - లోపలి గదిలోనుంచి హాలులో సంభాషణ వింటున్న వరలక్ష్మి అనుకుంది .

కన్నీళ్ళు, నిట్టూర్పులు, మందలింపులు, కేకలతో ఏకధాటిగా ఐదు గంటలు అలా రభస జరిగాక చిట్టిబాబు మనసంతా చికాకుగా ఉండి, సెకండ్‌షోకి వెళితే కొంచెం రిలీఫ్‌గా ఉంటుంది అనుకుని బయలు దేరబోతుంటే, బావమరిది పండుగాడు, 'సినిమాకా బావా? నేనూ వస్తాను' అన్నాడు, నిక్కరులో షర్టు టక్కు చేసి, దానిమీద మొల తాడు బిగిస్తూ.

పండుగాణ్ణి ఇదివరకోసారి సినిమాకు తీసుకెళ్ళాడు చిట్టిబాబు. సినిమా జరుగుతున్నంతసేపు పండుగాడు జోరీగలా చిట్టిబాబు చెవిలో రన్నింగ్ కామెంటరీ ఇస్తూనే ఉన్నాడు - ' ఈ రోలుకి బండోడు లాభం లేదు బావా! వాడికి ఫైటింగు రాదు. చిరంజీవే వుండాలి.... ఛ....ఛ.... ఇది డైరెక్షనా? నా తలకాయ, హీరోయిన్ హీరోని లెంప కాయ కొట్టగానే ధన్‌మని పాట స్టార్ట్ అయిపోవాలి. బంగారం లాంటి సీను తగలేశాడు. నాకిచ్చినా బ్రహ్మాండంగా డైరెక్ట్ చేసేవాణ్ణి'

వాడు ఫుల్ స్టాప్ లేకుండా అలా వాగుతూనే ఉన్నాడు. బండోడు బ్రేక్ చేయలేదు. వాడికి పొట్టకదా! బ్రేక్ చేయాలంటే చిరంజీవి - రాధ కాని, చిరంజీవి - భానుప్రియ కాని ఉండాలి. భానుప్రియ చీరలో కన్నా స్కర్టులో స్మార్ట్‌గా ఉంటుంది. అదే జయప్రదయితే, క్లాసికల్ బ్యూటీ కదా, చీరలోనే బాగుంటుంది.

'అసలు కొత్తగా వచ్చే హీరోయిన్లలో ఎవళ్ళకీ సరైన పెర్సనాలిటీ లేదు బావా' అన్నాడు పండుగాడు.

'వెధవా! నిక్కరేసుకోవడం రాదు, హీరోయిన్ల పెర్సనాలిటీ గురించి కామెంట్లు చేస్తావా? నోరు మూసుకు సినిమా చూడు' అని చిట్టిబాబు వాణ్ణో గుద్దు గుద్దినా వాడి నోరు మూత పడలేదు. హాలునుంచి ఇంటికెళ్ళేప్పుడు దారిలోనూ, ఆ తర్వాత రెండు మూడు రోజులూ, కనిపించినప్పుడల్లా డైరెక్షన్ గురించీ, ఏక్షన్ గురించీ, మ్యూజిక్ గురించీ, ఫొటోగ్రఫీ గురించీ చిట్టి బాబు ప్రాణాలు తీసేశాడు.

అప్పట్నుంచీ వాణ్ణి సినిమాకు తీసుకెళ్ళడమంటే భయం చిట్టిబాబుకి. అంచేత సినిమా ప్రోగ్రాం కేన్సిల్ చేసి, 'సినిమాకి కాదు-ఏట్లోకి' అన్నాడు విసుగ్గా.

'అయితే నువ్వే వెళ్ళు' అన్నాడు పండుగాడు, మొలతాడు టక్‌లోంచి షర్టు బయటకి లాగుతూ.

చిట్టి బాబు సినిమా ప్రయత్నం విరమించుకుని, ఊరంతా తిరిగి వచ్చి, రాత్రి పదవుతుండగా హాలులో మడతమంచం మీద నడుం వాల్చాడు. అతని పక్కన ఓ పట్టెమంచం మీద పడుకున్న పండు, గడియారం పది గంటలు కొట్టగానే ఉలిక్కిపడి లేచి, 'అరెరే! ఇవ్వాళ ఇవ్వడం మరిచిపోయాను నీ గొడవలో పడి- అర్థరూపాయ నష్టం' అని మంచం మీంచి దూకి లోపలికి పరిగెట్టి ఓ పుస్తకం తీసుకొచ్చి, 'రేపొద్దుట పావలా లైబ్రరీలో ఇవ్వాలి' అంటూచిట్టిబాబు పక్కనే ఉన్న టేబుల్ మీద పడేశాడు. వారపత్రికల్లోంచి సీరియల్ కట్ చేసి కుట్టిన పుస్తకం అది. అట్టమీద 'మృత్యువీణ' అని ఇంకుతో రాసి ఉంది.

'ఏవిటిది?' అన్నాడు చిట్టిబాబు, ఏదో పురుగును చూసినట్లు చూస్తూ.

'సీరియల్ - అక్క తీసుకు రమ్మంది'

'మీ అక్క ఈ సీరియల్ చదవలేదా?'

'ఇప్పటికి పాతిక సార్లు చదివింది. గొప్ప ఆడియో విజువల్ సీరియల్ లే'

'ఆడియో - విజువల్ సీరియల్ ఏవిటి? నేనెప్పుడూ వినలేదే'

'నీ బుర్ర అంతే కదా' అన్నట్లు పండుగాడు జాలిగా చూసి ఆడియో- విజువల్ సీరియల్ అంటే ఏవిటో వివరించాడు - 'సీరియల్ చదివితే స్టీరియో ఫోనిక్ సౌండుతో స్కోపు సినిమా చూసినట్టు కళ్ళకు కట్టినట్టుంటుందన్నమాట'

'బుర్రకి శ్రమ లేకుండానా?'

'ఏవిటన్నావ్?'

'ఏం లేదులే. ఎవడు తీశాడు ఈ సీరియల్?'

'ఆడియో - విజువల్ సీరియల్ తియ్యరు. రాస్తారు'

'ఏదో ఒకటిలే. ఎవడు రాశాడు?'

'డీవీపీ...'

'డీవీపీ ఎవడు?'

పండుగాడు షాక్ తగిలినట్లు ఓ సారి నోరు తెరిచాడు. అర నిమిషం తర్వాత నోరుమూసి ప్చ్....ప్చ్....ప్చ్...' అని మూడు సార్లు చప్పరించి, 'డీవీపీ అంటే తెలియదు. నీలో ఏం చూసి మా అక్క పెళ్ళి చేసుకుంటానంటోందే నాకర్థం కావడం లేదు' అన్నాడు.

'మీ అక్కనెవడో తలమాసినవాడు చేసుకోవాలి గాని నేను చేసుకోను. వెధవ వాగుడు వాగక అడిగిందానికి సమాధానం చెప్పు' అన్నాడు చిట్టి బాబు పండుగాడి నెత్తి మీద ఒకటందుకుంటూ.

డీవీపీ - దేవీ వర ప్రసాద్ - నవలాకాశంలో సూపర్ స్టార్ అట. మంత్ర తంత్రాలు, సస్పెన్స్, సైన్సూ, అన్నీ కలిపేసి అద్భుతంగా రాస్తాడట. మొదటి పేజీ చదివితే మళ్ళీ కింద పెట్టకుండా చివరి పేజీ వరకూ చదివేయాల్సిందేనట. మధ్యలో పుస్తకం దింపనీయకుండా, 'మిమ్మల్ని ఉత్తేజితుల్ని చేస్తూ, అనూహ్యకరమైన మలుపులతో , అడుగడుగునా ఒళ్ళు గగుర్పొడిచే సన్నివేశాలతో, మిమ్మల్ని మరో లోకంలోకి తీసుకు పోతాడట'

డీపీపీ గురించి వివరంగా చెప్పి, 'ఓసారి చదివి చూడు - సస్పెన్స్ కింగ్ అంటే ఏవిటో నీకే తెలుస్తుంది. నీ నాలెడ్జ్ కూడా ఇంప్రూవవుతుంది' అని సలహా ఇచ్చాడు పండుగాడు.

'ఆ చెత్త చదివి ఇంప్రెస్సైపోవడానికి పండుగాడిలా ఏడో క్లాసు రుబ్బే అరపైసగాణ్ణి కాదు. ఈ బ్రెయినుంది చూశావా?'- చిట్టి బాబు కుడి చేతి చూపుడు వేలుతో తన తల మీద టింగు టింగున మోగించి, 'ఇది సూపర్ కంప్యూటర్ రా పండుగా, టెన్త్ రెండుసార్లు తన్నేసిన పావలా సైజు బ్రెయిన్ కాదు' అన్నాడు స్టయిలుగా.

'ఓసారి అద్దంలో చూసుకో నీ సూపర్ కంప్యూటర్‌ని' - పండుగాడు కోపంగా అన్నాడు - 'మా సస్పెన్స్ కింగ్ గురించి మాట్లాడ్డానికి నీకు అర్హత లేదు'

'ఒరేపండూ - అసలు సస్పెన్స్ అంటే ఏవిటో తెలుసా?'

'నన్ను టెస్టు చేస్తున్నావా? సస్పెన్స్ అంటే సస్పెన్సే'

'పోనీ నారికేళ పాకం , ద్రాక్షపాకం అని మీ తెలుగు మాస్టారు అనడం విన్నావా?'

'విన్లేదు'

'మీ అక్కకే తెలియదులే - నీకేం తెలుస్తుంది, అరపైసగాడివి. అలాగే జీళ్ళపాకం అని సాహిత్యంలో ఇంకో పాకం ఉంది. దాన్నే ఇంగ్లీషులో సస్పెన్స్ అంటారన్నమాట. సస్పెన్స్ అంటే జీళ్ళ పాకవైతే, సస్పెన్స్ కింగ్ ఏవవుతాడో తెలుసా?'

'..........'

'జీడికి రాజు....హ్హా.....హ్హా.....హ్హా.....'

'నీ జోకు నీ మొహంలా ఉంది. మళ్ళీ అద్దంలో చూసుకో' - కోపంగా అని ముసుగెట్టేశాడు పండుగాడు.

పండుగాడు ముసుగెట్టేశాక చిట్టిబాబుకేమీ తోచలేదు. నిద్రరాక పండుగాడ్ని లేపి పేకాడదామా అనిపించి, 'ఒరే పండూ - పేకాడదామా?' అనడిగాడు.

'నేను ఆణ్ణు' అన్నాడు పండుగాడు ముసుగులోంచే.

నిద్ర పట్టక అటూ ఇటూ దొర్లుతున్న చిట్టిబాబు దృష్టి సీలింగ్ ఫాన్ గాలికి రెప రెపలాడుతున్న సీరియల్ పుస్తకం మీదికి మళ్ళింది. చిట్టిబాబుకి పత్రికల్లో సినిమా బొమ్మలు, కార్టూన్లూ, వారఫలాలు తప్ప మరేవీ చూసే అలవాటు లేదు.

కథలు, సీరియల్సు, అసలు చదవడు. అవంటే అతడికి ఎలర్జీ కానీ,నిద్రపట్టక దొర్లుతూ కేవలం కాలక్షేపం కోసం మాత్రమే రాత్రి పదిగంటల ఇరవైమూడు నిమిషాలకి టేబులు మీంచి ఆ పుస్తకం తీసి మొదటి పేజీ చదవడం మొదలు పెట్టాడు, నిరాసక్తంగా.

పన్నెండవుతుండగా చివరి పేజీ చదువుతున్నాడు చిట్టి బాబు -

'..... తలుపు మీద టకటక మని రెండుసార్లు కొట్టిన శబ్దం వినిపించింది. కుమార్ దేవ్ కోటు జేబులోంచి రివాల్వరు తీసి, తలుపు దగ్గరికి మెల్లగా చప్పుడు కాకుండా నడిచి వెళ్ళి, హాండిల్ మీద చేయి వెయ్యబోయి ఠక్కున ఆగిపోయాడు.

అతనికి ఇచ్చిన ట్రైనింగూ, వృత్తిలో అతని అనుభవం అతన్ని చెయ్యి వెయ్యనియ్యలేదు. కోటు పాకెట్టులోంచి టెస్టర్ తీసి డోర్ హాండిల్ లోకి కరెంటు పాసవుతుందో లేదో చెక్ చేశాడు. కరెంటు పాస్ అవడం లేదు. కుడిచేత్తో రివాల్వర్ తలుపుకేసి గురిపెట్టి ఎడం చెయ్యి హాండిల్ మీద ఉంచి, గుండెల నిండా గాలి పీల్చి, ఒక్క ఊపులో హాండిల్ నొక్కి తలుపు లాగి, 'హాండ్సప్' అన్నాడు.

అతడు అలా తలుపు లాగగానే తలుపునానుకునే ఉన్న సుహాసిని అతని మీద వాలిపోయింది. 'సుహా! సరసాలకి ఇదా సమయం?' అని అతడు మందలించబోతుం డగా సుహాసిని నిర్జీవ శరీరం కార్పెట్ మీద వాలిపోయింది.

పచ్చటి ఆమె శరీరం మెల్లి మెల్లిగా బంగారం కరిగినట్లు కరిగిపోతూ అదృశ్య మవుతోంది.

కుమార్‌దేవ్‌కి అంతా అర్థమైంది - సుహాసినికి పి2 కెమికల్ ఇంజక్ట్ చేశారు.

మానవ శరీరంలో వైట్ బ్లడ్ సెల్స్యూ, రెడ్ బ్లడ్ సెల్స్యూ విడివిడిగా సర్క్యులేట్ అవుతుంటాయి. పి.2 కెమికల్‌లోని ఏటమ్స్ కేటలిస్టుగా పనిచేసి వైట్ బ్లడ్ సెల్స్‌ని, రెడ్ బ్లడ్ సెల్సుని కోల్డ్ ఫ్యూజన్‌లో బంధించేస్తాయి. ఆ విస్ఫోటనంలో అమితమైన వేడి పుడుతుంది. కాని అది సెల్‌కే పరిమితమవుతుంది. ( మైక్రో ఓవెన్‌లో పేపర్ బేగ్‌లో ఉన్న బంగాళా దుంప పేపరు కాలకుండానే ఉడుకుతుంది - డీవీపీ). 2327 డిగ్రీల సెంటీ గ్రేడులో కాని బూడిదవని శరీరం ఈ శీతల కొలిమిలో కేవలం రెండు నిమిషాల్లో బూడిద వుతుంచె. ఆ తర్వాత మిగిలేది సుహాసిని స్మృతులు, పిడికెడు బూడిద. .....

రెండు నిమిషాల తర్వాత కుమార్ దేవ్ ముందుకు వంగి కుడిచేతి పిడికిలితో చితాభస్మం తీస్తూ అన్నాడు - 'సుహా! దీని మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. నిన్ను అంతం చేసినవాళ్ళు రేపు సూర్యాస్తమయం చూడరు. ఇంతవరకూ ఏ వ్యక్తీ చావని విధంగా ఒక్కొక్కళ్ళూ ఒక్కో రకంగా అతి ఘోరమైన చావు చస్తారు... అంతే... అలాగే జరుగుతుంది.'

ఆవేశంలో అతని పెదవులు అదురుతున్నాయి. అతని పిడికిలి బిగిసింది. అతని కళ్ళల్లోంచి నిప్పులు రాలుతున్నాయి.

'డాక్టర్ యూ కా....కా....కా....'

అతను వేసిన కేక అర్థరాత్రి నిశ్శబ్దంలో ఉరుములా ప్రతిధ్వనించింది. ఆ శబ్దం గాలిలో కలిసిపోతుండగా అతని వెనకనుంచి చిన్న నవ్వు వినిపించింది - 'డాక్టర్ యూకాతో వ్యవహారం నిప్పుతో చెలగాటం మిస్టర్ కుమార్ దేవ్! ముందు నువ్వు సూర్యోదయం చూడవు.'

కుమార్ దేవ్ గిరుక్కున వెనక్కుతిరగబోతుండగా తలమీద బలంగా దెబ్బ తగిలింది. అతను రివాల్వరు వదిలేసి కార్పెట్ మీద నిస్సత్తువగా కూలిపోతుండగా ....

## (మొదటి భాగం సమాప్తం)

చిట్టి బాబు కెవ్వుమన్నాడు. అంతవరకూ రెండో భాగం ఉందని అతనికి తెలియదు. జుట్టు పీక్కుంటూ 'ఒరే పండూ - రెండో భాగం ఏదిరా?' అన్నాడు, పండుగాణ్ణి ఓ తాపు తన్ని.

గాఢనిద్రలో ఉన్న పండుగాడు ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. అప్పుడు గోడ గడియారం పన్నెండు గంటలు కొడుతోంది. పిచ్చాడిలా జుట్టు పీక్కుంటున్న చిట్టిబాబుని చూసి, 'ఏవిటి? అర్ధరాత్రి వేళ అంకమ్మ శివాలు?' అన్నాడు వాడు చికాగ్గా.

'రెండో భాగం ఏదిరా?'

'ఏ రెండో భాగం?'

'మృత్యువీణ'

'అది నీకెందుకు, పావలా సైజు మెదళ్ళకి, అర్ధపైసగాళ్లకీ గానీ? పడుకో'

'అసలు రెండో భాగం తీసుకొచ్చావా?'

'తీసుకొచ్చాను'

'ఎక్కడుంది?'

'చెప్పను. మా సస్పెన్స్‌కింగ్‌ని జీడికి రాజన్నావు. డీపీపీ అభిమానుల్ని మమ్మల్ని పావలా, అర్ధపైసాగాళ్ళని ఇన్సల్టు చేశావు'

'నా బ్రెయినే పావలా లైబ్రరీ గాని తొందరగా చెప్పు గాడిదా'

'తొందరగాను చెప్పను, ఆలస్యంగానూ చెప్పను. నువ్వు క్షమార్పణ చెప్పి పది రూపాయలు పరువు నష్టం కింద ఇచ్చుకుంటే చెబుతాను.'

' రేపిస్తాలే'

'రేపు చెబుతాలే'

చిట్టిబాబుకి పండుగాణ్ణి చంపేద్దావన్నంత కోపం వచ్చింది. అయినా నిగ్రహించుకుని, పాంటు జేబులూ, షర్టు జేబులూ అన్నీ వెతికి, ఎనిమిది రూపాయల ఇరవైఐదు పైసలు వాడి చేతిలో పెట్టి, 'మిగతాది రేపిస్తాలే - ఇప్పుడు చెప్పు,' అన్నాడు.

'నేడు నగదు - రేపు అరువు'

ఇంక సంప్రదింపులు, శాంతి సంభాషణలూ జరిపే ఓపిక నశించిపోయింది చిట్టిబాబుకి - 'ఒరే పండూ! పేజీకో మర్డరు చూసిన వాణ్ణి - నీ పీక నొక్కేయడం నాకు కష్టం కాదు కానీ అర్ధరాత్రి వేళ నిన్ను మర్డరు చేస్తే నువ్వు దెయ్యమై నన్నే తగులుకుంటావని భయంగా ఉంది. అంచేత చెయ్యి మాత్రం విరిచేస్తా' అని, అరవకుండా వాడి నోరు నొక్కి చెయ్యి మెలి తిప్పాడు గట్టిగా. వాడు కుయ్యోమని మూలిగి, చెబుతానన్నట్లు తల ఊపాడు.

'ఎక్కడుంది?'

'అక్క దగ్గరుంది'

'తీసుకురా'

'తీసుకురాను'

'తీసుకురావూ?'

చెయ్యి మళ్ళీ మెలి తిప్పాడు చిట్టిబాబు. వాడు మళ్ళీ కుయ్యోమని 'తీసుకొస్తాను బాబోయ్' అంటూ లోపలికి పరిగెట్టాడు.

అయిదునిమిషాలైనా వాడు తిరిగి రాకపోతే, హాల్లో అసహనంగా పచార్లు చేస్తున్న చిట్టిబాబు, 'ఎక్కడ చచ్చాడు వీడు?' అనుకుంటూ లోపలికి పరిగెట్టాడు. పండుగాడు వాళ్ళ నాన్న పక్కన పడుకుని గుర్రు పెడుతున్నాడు.

'ఓరి వెధవా!' అనుకుని, వాణ్ణి ఎలా లేపడమా అని ఆలోచిస్తూ కాసేపు అక్కడే నిలబడ్డాడు.

మేనమామ నిద్రలో కాబోలు అటూ ఇటూ కదిలాడు.

ఇక పండుగాడి మీద ఆశ వదులుకుని చిట్టిబాబు హాల్లోకి వచ్చి మంచంమీద వాలి నిద్రపోదామని కళ్ళు మూశాడు. కాని చెవుల్లో కుమార్‌దేవ్ మాటలే గింగురుమంటున్నాయ్- 'అంతే - అలాగే జరుగుతుంది'

కుమార్‌దేవ్ సూర్యోదయం లోపున ఎలా తప్పించుకుంటాడు? సూర్యాస్తమయం లోపున శత్రువులందరూ ఎంత ఘోరంగా ఎలా చస్తారు? అసలు మొదటి భాగంలో చివర ప్రత్యక్షమైన డా. యూకా ఎవడు? ఈ సస్పెన్స్ విప్పడానికి తెల్లారే దాకా ఆగాలంటే పిచ్చెక్కినట్లుగా ఉంది చిట్టిబాబుకి.

మొట్టమొదటిసారి ఓ క్వార్టర్ బాటిల్ రుచి చూసి, కొంచెం నిషా అందుకుని, హుషారుగా ఓ ఫుల్ బాటిల్ లాగిద్దామని బార్‌దాకా పరిగెట్టిన వాడికి 'మూయబడినది' అనే బోర్డు కనిపిస్తే ఎలా ఉంటుందో అలా ఉంది చిట్టిబాబుకి.

'పోనీ వరాహలక్ష్మి గదిలోకి వెళ్ళి చూస్తే .... '

ఇంతవరకూ పండుగాణ్ణి బతిమాలడమే కాని తనే వెళ్ళి తెచ్చుకోవచ్చన్న ఆలోచనే రాలేదు చిట్టిబాబుకి. ఆ ఆలోచన రాగానే, 'నేనెంత పిచ్చి వెధవని! అనవసరంగా పావుగంట వేస్ట్ చేశాను' అని తన నెత్తిమీద తానే ఒకటి కొట్టుకుని మేడమీదున్న వరలక్ష్మి గది వైపు పరిగెట్టాడు చిట్టిబాబు.

వరలక్ష్మి గది తలుపు దగ్గరగా వేసి ఉంది. గదిలో ట్యూబులైటు వెలుగుతోంది. తలుపు మెల్లిగా తెరిచి, తొంగిచూసి, పిల్లిలా చప్పుడు చేయకుండా రెండడుగులు వేసి వరలక్ష్మికేసి చూసిన చిట్టిబాబు గుండె ఓసారి లయతప్పి కొట్టుకోవడం మొదలు పెట్టింది. అతని చూపు వరలక్ష్మి వక్షస్థలం మీదే ఆగిపోయింది. 'ఆ....' అని నోరు తెరిచాడు చిట్టిబాబు కళ్ళు తిప్పుకోలేక.

వరలక్ష్మి లావుగా ఉంటుందే కాని అనాకారి మాత్రం కాదు. ట్యూబ్‌లైట్ వెలుగులో తెల్లచీర, తెల్లజాకెట్టు, తలలో బుట్టెడు మల్లెపూలతో, వడ్డాది పాపయ్యగారి చిత్ర సుందరిలా తళతళా మెరిసిపోతూ, రెండు చేతులు గుండెల మీద వేసుకుని నిద్రపోతోంది వరలక్ష్మి.

మెరిసేకళ్ళతో వరలక్ష్మి గుండెల కేసి చూస్తూ, నోరుమూసి మళ్ళీ ' ఆ.... ' అని తెరిచి, గుటకలేస్తూ ముందుకు కదిలాడు చిట్టిబాబు.

అయితే చిట్టిబాబుని ఆకర్షించింది వరలక్ష్మి సౌందర్యమూ కాదు, ఆమె

వంపుసొంపులూ కావు. అసలు వరలక్ష్మి సంగతే అతను పట్టించుకోలేదు. ఆమె గుండెలకీ, గుండెల మీద వేసుకున్న చేతులకీ మధ్య, ఆమె ఉఛ్వాస నిశ్వాసాలకు అనుగుణంగా పైకి కిందకు కదులుతున్న 'మృత్యువీణ' రెండవ భాగం మీదే అతని చూపు నిలిచి ఉంది.

మంచం పక్కన అడుగు దూరంలో నిలబడి 'వరలక్ష్మి! ఆ పుస్తకం ఇలా ఇయ్యి' అన్నాడు మెల్లిగా.

వరలక్ష్మి ఉలకలేదు, పలకలేదు.

'ఏయ్.... నిన్నే..... ఆ పుస్తకం ఇలా ఇయ్యి.' అన్నాడు ఇంకొంచెం దగ్గరికి జరిగి.

ఓ రెండు నిమిషాలు అలా అరిచి, అరిచి, నెత్తి కొట్టుకుంటూ, 'ఈ బొండాన్ని లేపడం దేవతల తరం కాదు. .... ' అనుకుని , కుడిచేతి చూపుడు వేలు , మధ్యవేలు పటకారులా చేసి వరలక్ష్మి చేతుల కింద ఉన్న పుస్తకాన్ని అందుకుని, వరలక్ష్మి శరీరానికి ఎక్కడా తన చెయ్యి తగలకుండా జాగ్రత్త పడుతూ లాగడానికి ప్రయత్నించాడు. పాలరాతి స్తంభాల్లాంటి వరలక్ష్మి చేతుల కింద ఉన్న పుస్తకం మిల్లీమీటరు కూడా కదల్లేదు.

అర నిముషం రెస్టు తీసుకుని, మొహానికి పట్టిన చెమట తుడుచుకుని , మళ్ళీ లేచి వరలక్ష్మి భుజం పట్టుకుని కుదుపుతూ, 'ఓ వరాహలక్ష్మీ! ఆ చేతులు తీసేయ్ మరిడీ మహాలక్ష్మి' అన్నాడు ఏడుపు మొహం పెట్టి.

వరలక్ష్మి కదల్లేదు. ఏం చెయ్యాలో తెలియక తల పట్టుకుని అక్కడే కుర్చీలో కూలబడిపోయాడు. అలా కొంచెం సేపు కూర్చున్నాక కొంచెం శాంతించి, 'పోనీ! వెధవ పుస్తకం రేపు చదువుకోవచ్చులే' అని లేచి గుమ్మం దాకా తిరిగి వెళ్ళిన చిట్టిబాబు చెవుల్లో 'డాక్టర్ యూకా....కా...కా....కా... ' అన్న కేక ఫుల్ స్టీరియో ఫోనిక్ సౌండ్‌లో గింగురుమంది.

వెంటనే జుట్టుపీక్కుంటూ వరలక్ష్మి మంచం దగ్గరికి పరిగెట్టి, వరలక్ష్మి రెండు చేతులు పట్టుకుని గుంజుతూ, ముందుకు వంగి వరలక్ష్మి చెవి దగ్గర తన నోరు పెట్టి 'ఒసే దెయ్యం! ఆ పుస్తకం వదలవే?' అని గట్టిగా అరవబోతుంటే, 'చూశావా చెల్లెమ్మా! వీణ్ణేం చెయ్యమంటావ్? 'అన్న ఉరుములాంటి స్వరం ( సస్పెన్స్ కథలోలా) వెనుకనుంచి వినిపించి, ఉలిక్కిపడి వరలక్ష్మిని వదిలేసి, పైకి లేచి, వెనక్కు తిరిగి చూశాడు చిట్టిబాబు.

గుమ్మం దగ్గర కర్ర పుచ్చుకుని మేనమామ, పక్కన తల్లి నిలబడి ఉన్నారు. అర్థరాత్రి వేళ చిట్టిబాబు తన గదిలోకి వచ్చి అటూ ఇటూ తచ్చాడి, మేడమీద వరలక్ష్మి గదిలోకి వెళ్ళడం చూశాడు మేనమామ. వెంటనే లేచి, చేతికర్ర తీసుకుని, చెల్లెల్ని లేపి 'చెల్లెమ్మా! చెల్లెమ్మా! నీ కొడుకు చేసే పనులేమన్నా బాగున్నాయా? ' అన్నాడు ఆవేశంగా.

'ఏం పనులు?' అంది చెల్లెమ్మ.

'నా నోటితో నేను చెప్పలేను. నీ కళ్ళతో నువ్వే చూడు' అని చెల్లెమ్మని లాక్కొచ్చాడు అన్నయ్య.

వాళ్ళిద్దరూ గది గుమ్మం దగ్గరకి వచ్చేటప్పటికి చిట్టిబాబు రెండు చేతులూ వరలక్ష్మి గుండెలమీదా, చిట్టి బాబు మొహం వరలక్ష్మి మొహం పైనా...

'హవ్వ.... ఏవిట్రా ఇది? అర్ధరాత్రిపూట దాని గదిలోకి ఎందుకొచ్చావ్? ' అంది తల్లి.

'సుహా...శవం... పీ 2 ...డాక్టర్ యూకా...' అన్నాడు చిట్టిబాబు నీళ్ళు నములుతూ.

'పిచ్చెక్కినట్లు ఏక్ట్ చేస్తే వదిలేస్తాననుకున్నావేమో? నా దగ్గర ఆ వేషాలు కుదరవు' అన్నాడు మేనమామ, కర్రతో నేలమీద గట్టిగా కొట్టి.

'నాకేం పిచ్చెక్కలేదు. కావాలంటే చూడు... వరాహ .. వరలక్ష్మి ఆ పుస్తకం పట్టుకుని ఎలా నిద్రపోతుందో.... ఆ పుస్తకం గురించే వచ్చాను' అన్నాడు చిట్టిబాబు చికాగ్గా.

'కొబ్బరి చెట్టు ఎందుకెక్కావంటే దూడల గడ్డికోసవన్నాడట వీళ్ళాంటివాడే! అర్ధరాత్రి వేళ ఆడపిల్ల ఒంటరిగా నిద్రపోతున్న గదిలోకి దొంగలా వెళ్ళి, దాని మీద చేతులేసి, ఎందుకంటే, పుస్తకం కోసం అంటున్నాడు వీడు. వింటున్నావా చెల్లెమ్మా?'

'శుభ్రంగా పెళ్ళి చేస్తానంటే వద్దని గోల చేసి, అర్ధరాత్రి వేళ ఈ వెధవ పనులేవిట్రా?' అంది తల్లి

'ఏ వెధవ...ప...ను...లు...?' - తల్లీ, మేనమామ అనుకుంటున్నదేమిటో అప్పటికి అర్థమైంది చిట్టిబాబుకి - 'కొబ్బరి చెట్టు నిజంగా దూడల గడ్డి ... డీవీపీ సీరియల్ కోసమే ఎక్కానేవ్... వేరే ఉద్దేశం లేదేవ్.. ఇంత గోల జరుగుతున్నా అది ఎలా నిద్రపోతోందో చూశావా? నాకు దీనితో పెళ్ళేవిటేవ్?' అని గొల్లుమన్నాడు చిట్టిబాబు.

'పెళ్ళొద్దన్నావంటే పళ్ళు రాలగొడతాను'

'నీకెందుకు శ్రమ చెల్లెమ్మా? నువ్వు కొంచెం అడ్డుతప్పుకో. వీడి కాళ్ళూ, చేతులూ నేను విరిచేస్తాను' అన్నాడు అన్నయ్య.

'వద్దు! తెల్లారగానే శాస్త్రులుగారి దగ్గరకెళ్ళి ముహూర్తం పెట్టించు. నలుగురికి తెలిస్తే ఎంత అప్రదిష్ట?' అంది చెల్లెమ్మ.

'అలాగే చేస్తా కాని ఈ రాత్రికి వీడు మేడెక్కకుండా జాగ్రత్తగా కాపలా కాయి,' అన్నాడు అన్నయ్య.

చిట్టిబాబు నెత్తీ నోరు కొట్టుకున్నాడు కాని ప్రయోజనం లేకపోయింది. ఫైనల్‌గా తన మాట చెప్పి తల్లి వెళ్ళిపోబోతుంటే, ఇల్లు ఎలాగా కాలిపోయింది, బొగ్గులేనా ఏరుకుందామన్న ఆశతో - ' కనీసం ఆ దెయ్యం దగ్గర్నుంచి ఆ పుస్తకం తీసి నా మొహాన్ని పడేసి వెళ్ళవే అమ్మా' అన్నాడు చిట్టిబాబు ఏడుస్తూ.

'చూడు చెల్లెమ్మా! అమ్మాయిని దెయ్యవంటున్నాడు'

'వాడి పెళ్ళాన్ని వాడిష్టం వచ్చినట్లు పిలుస్తాడు కాని ఆ పుస్తకం సంగతేమిటో చూడు'

మేనమామ వరలక్ష్మిని ఓ గుద్దు గుద్ది, 'ఏ..... హే...య్.... ' అని పొలాల్లో రైతులు పొలికేక వేసినట్లు, మైలు దూరంలో పడుకున్న వాళ్ళు ఉలిక్కిపడి లేచేలా, ఓ

కేక వేసి చేతికర్రతో మంచం కింద ఉన్న డబ్బాలు ధమ ధమా వాయించి మళ్ళీ ఇంకో గుద్దు గుద్ది, 'అ... మ్మాయ్' అని ఇంకొక పొలికేకవేశాడు. వరలక్ష్మి బద్ధకంగా కళ్ళు తెరిచి 'ఏవిటి నాన్నా?' అంది.

'ఈ కుంభకర్ణిని ఇలా లేపాలా?' అనుకున్నాడు చిట్టిబాబు దిగులుగా.

'ఆ పుస్తకం ఇలా పడేయ్. నీ మొగుడికి కావాలిట' అన్నాడు మేనమామ.

నాలుగురోజుల్లో చిట్టిబాబు-వరలక్ష్మిల వివాహం అయిపోయింది. మేనమామ కూతుర్ని సాగనంపుతూ, 'అల్లుడిగారికి అన్నీ అందాయా? ఇంకేమన్నా తక్కువ య్యాయా?' అన్నాడు.

'తక్కువయ్యాయి'

'ఏం తక్కువయ్యాయి?' - మేనమామ తెల్లబోయి అడిగాడు.

'మేడ మీది గదిలో మంచం కింద డబ్బా.. చేతి కర్రా... ' అన్నాడు చిట్టిబాబు దుఃఖంగా.

చిట్టిబాబు బావతో కలిసి అత్తారింట్లో అడుగుపెడుతూ, 'థాంక్యూ డీవీపీ' అంది వరలక్ష్మి ఆనందంతో.

' డీవీపీ ఎడ్రసు తెలుసా?'

'ఏం? రిసెప్షన్‌కి పిలుద్దామా?'

'వద్దు కాని చిన్న పనుందిలే ' అన్నాడు చిట్టిబాబు దవడ కండరం బిగిస్తూ.

***

'ఏవిటోయ్ చిట్టిబాబూ? అండర్ గ్రౌండ్ వెళ్ళిపోయావా? రెండేళ్ళయింది నీ దర్శనమై'

'క్షణం తీరికుండటం లేదండి'

'వరలక్ష్మి ఎలా ఉంది? సంసారం ఎలా సాగుతోంది?'

'సంసారానికేం? బ్రహ్మాండంగా మూడు కథలూ, ఆరు సీరియల్స్‌లా సాగు తోందండి'

'అదేవిటి - వరలక్ష్మి మారలేదా?'

'బాగా మారిందండి'

'మరి అలా ఏడుపు మొహం పెట్టి మాట్లాడుతావేవిటోయ్?'

'పాఠకురాలు ముదిరితే రచయిత్రి అవుతుంది కదండీ.'

'అంటే?'

'... వరలక్ష్మి ఇప్పుడు సైంటిఫిక్ , హార్రర్ , సస్పెన్స్, మిస్టరీ నవలలు రాస్తోందండి'

'కొంపతీసి అవన్నీ నువ్వు చదువుతున్నావేవిటి? అలా మెంటల్ కేసులా అయిపోయావు'

'తాళి కట్టాక తప్పుతుందాండి?'

'అయ్యో పాపం ఎంత కష్టం వచ్చింది నీకు! ఏవన్నా పబ్లిష్ అయ్యాయా?'

'లేదండీ! మొదటి పాఠకుడ్నీ, చివరి పాఠకుడ్నీ నేనేనండి'

'అది సరే కాని, నెత్తిమీద ఆ మూటేమిటోయ్?'

'మూడు పిశాచాలూ, నాలుగు నకిలీ బాండ్లూనండి, పోస్టాఫీసుకి తీసుకెడుతున్నానండి'

'అదేవిటి చిట్టిబాబూ ! ఇంత ఎండలో నెత్తి మీద అంత బరువు పెట్టుకుని నడిచి వెళ్ళక పోతే, హాయిగా స్కూటరుందికదా, స్కూటరు మీద తీసుకెళ్ళకపోయావుటోయ్'

'ఇంకెక్కడి స్కూటరండి ? ఎప్పుడో అమ్మేశానండి.'

( ఆంధ్రప్రభ వార పత్రిక , 29-8-90)